

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

# దివ్యాంగుల ధర్నా

ఎదులాపురం, మార్చి 17 : వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట దివ్యాంగులు ధర్నా నిర్వహించారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎన్పీఆర్డీ జిల్లా అధ్యక్షుడు నగేశ్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చే రూ.300 పింఛన్‌ను రూ.3 వేలకు పెంచాలని.. రాష్ట్ర ప్రభుత్వం కూడా రూ.6 వేలకు పెంచి ఇవ్వాలని కోరారు. నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని, యూడీఐడీ కార్డులను జారీ చేయాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎన్పీఆర్డీ నాయకులు ఆరీఫా, ఆశన్న పాల్గొన్నారు.



# ఆశల ధర్నా

ఎదులాపురం, మార్చి 17 : ఆశ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. ఈ సందర్భంగా సీఐటీయూ ఉపాధ్యక్షుడు చిన్నన్న మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించారని మండిపడ్డారు. పక్క రాష్ట్రాల్లో రూ.18 వేల వేతనం ఇస్తున్నారని, అదే తరహాలో మాకు కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. ఉద్యోగ భద్రత కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాల్లో నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈనెల 19న కలెక్టరేట్ల దిగ్బంధం, 24న అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుజాత, సంగీత, లక్ష్మి, పద్మ, శోభ, రాణి, శ్రీదేవి, లావణ్య, శ్రీలత, త్రివేణి పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న కుటుంబీకులు, బంధువులు

# ప్రేమ పేరిట వేధించిన వ్యక్తిని శిక్షించాలని రాస్తారోకో

భైంసా, మార్చి 17 : పట్టణంలోని పులేనగర్‌కు చెందిన విద్యార్థిని కదం కోమల్ ఆత్మహత్యకు కారణమైన బాధ్యుడిని కఠినంగా శిక్షించాలని బాలిక తరపు బంధువులు, కుటుంబీకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అభం, శుభం తెలియని బాలికను ప్రేమ పేరిట వేధించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలన్నారు. దీంతో ఘటన స్థలానికి చేరుకున్న ఏఎస్పీ అవినాశ్ కుమార్ చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు.


ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

# అంగన్‌వాడీల పోరుబాట

## డిమాండ్లను పరిష్కరించాలని కలెక్టరేట్ల ఎదుట ధర్నా

- ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేస్తే ఊరుకోబోమని హెచ్చరిక
- పీఎం శ్రీ, మొబైల్ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్

**డిమాండ్స్..**

- ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలి.
- ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకం, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను రద్దు చేయాలి. కేంద్రం తెచ్చిన నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయకుండా అసెంబ్లీలో తీర్మానం చేయాలి.
- అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు గ్రాట్యుటీ వర్తింప చేసి, పర్మినెంట్ చేయాలి.
- కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచిన రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి.
- మినీ టీచర్లకు 10 నెలలుగా బకాయిపడిన వేతనాలు చెల్లించాలి. హెల్పర్లను నియమించాలి.
- మంత్రి సీతక్క హామీ మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ కొత్త జీవో ఇవ్వాలి. ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పింఛన్లు ఇవ్వాలి.

మంచిర్యాల, మార్చి 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాని డిమాండ్ చేస్తూ సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలు కలెక్టరేట్‌ల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల ఎదుట ఈ మేరకు తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వంటావార్పు చేసుకుంటూ 48 గంటలపాటు నిరసనను కొనసాగించనున్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్(ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్)ను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. నూతన జాతీయ విద్యా విధానం పేరిట పీఎం శ్రీ, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్స్ తీసుకొచ్చి ఐసీడీఎస్‌ను మూసివేయాలని చూస్తే ఊరుకోబోమని మండిపడ్డారు. రాష్ట్రంలో ఈ చర్యలను వెంటనే ఆపాలని, జాతీయ విద్యా విధానం చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేసేది లేదని అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏండ్లుగా ప్రీ స్కూల్ విద్యను అందిస్తున్న అంగన్‌వాడీ సెంటర్లకు అదనపు పనులు, ఆన్‌లైన్ పనులు తగ్గించి బడ్జెట్ పెంచి అంగన్‌వాడీ సెంటర్లనే నర్సరీ కేంద్రాలుగా మార్చాలన్నారు. ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఐసీడీఎస్ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీలు పోరాటాలకు సిద్ధమయ్యామన్నారు. ప్రభుత్వం మా న్యాయమైన 23 డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

### రామన్న మద్దతు

ఎదులాపురం, మార్చి 17 : సమస్యల సాధనే లక్ష్యంగా సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపడుతున్న మహాధర్నాకు మాజీ మంత్రి జోగు రామన్న సంపూర్ణ మద్దతు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను ఎండగడుతూ అంగన్‌వాడీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రామన్న మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేలా బీఆర్ఎస్ ప్రభుత్వం జీవోను విడుదల చేసిందని, ఎన్నికల కోడ్ కారణంగా జీవో నిలిచిందని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీల ఇబ్బందులపై స్పందించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి, కోశాధికారి మంగ, జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ ఆశన్న, కిరణ్ పాల్గొన్నారు.

### రిటైర్మెంట్ బెనిఫిట్స్ కొనసాగించాలి..



అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలి. గత ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రకటించింది. వాటిని కొనసాగిస్తామని మంత్రి సీతక్క గతంలో చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి షరతులు లేకుండా రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలి. రూ.18 వేల వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలి. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయకుండా అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి. జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్రంలో అమలు చేయబోమని రేవంత్‌రెడ్డి సర్కార్ అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేయాలి.

**- భానుమతి, అంగన్‌వాడీ టీచర్, మంచిర్యాల**

### ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేయద్దు..



ఏండ్లుగా గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలకు ప్రీ స్కూల్ విద్యను అందిస్తూ మహిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపాలను నిర్మూలించేందుకు పని చేస్తున్న అంగన్‌వాడీలను నిర్వీర్యం చేయడం సరికాదు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ సర్కార్ ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఐసీడీఎస్ వ్యతిరేక విధానాల అమలును వెంటనే ఆపేయాలి. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో స్పష్టమైన ప్రకటన చేయాలి.

**- కుందారం స్వాతి, హెల్పర్ మంచిర్యాల**


మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట..


నిర్మల్ ఆర్డీవో కార్యాలయం ఎదుట సమ్మెలో వంట చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న


కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్ ఎదుట..

# విద్యార్థులకు న్యాయం చేయండి

**అసెంబ్లీలో ప్రస్తావించిన బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్**



నేరడిగొండ, మార్చి 17 : విదేశాలకు వెళ్లిన విద్యార్థులకు ఓవర్సీస్ స్కాలర్‌షిప్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్యాయం జరిగిందని వారికి న్యాయం చేయాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. సోమవారం ప్రశ్నోత్తరాల సమయంలో అసెంబ్లీలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం పేద, దళిత, గిరిజన విద్యార్థుల పైచదువుల కోసం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మంజూరు చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రూ.25 లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పుడు ఇవ్వకుండా విద్యార్థులను ఆగం చేసిందన్నారు. రాష్ట్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సౌకర్యాలు లేవన్నారు. వసతులు లేక విద్యార్థులు గోడలు దూకి ఇంటికి పారిపోతున్న పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. అలాగే ఇచ్చోడ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఎలాంటి అనారోగ్యం లేకపోయినా నిద్రలో ఆకస్మికంగా విద్యార్థిని ఎలా చనిపోయిందని ప్రశ్నించారు. అధికారులు వాస్తవాన్ని దాచిపెట్టి వారికి తోచిన విధంగా చెబుతున్నారని ఆరోపించారు. కొందరు పాముకాటు అన్నారు. కొందరు నిద్రలో చనిపోయిందన్నారు. అధికారుల్లో స్పష్టత లేదన్నారు. ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేసి విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలన్నారు.

# సుంగాపూర్ సమరభేరి

- నీటి సమస్యను పరిష్కరించాలని ఊరంతా కదిలారు
- ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత
- మా ఊరికి పిల్లలను ఇస్తలేరని గిరిజనుల ఆవేదన
- వ్యవసాయ పనులు మానుకుని నీటి కోసం నిరీక్షణ


తాగునీటి సమస్య పరిష్కరించాలని ప్రజావాణికి తరలివచ్చిన సుంగాపూర్ గ్రామస్తులు

ఆదిలాబాద్, మార్చి 17(నమస్తే తెలంగాణ) : నీటి సమస్యను పరిష్కారానికి సుంగాపూర్ వాసులు సమరభేరి మోగించారు. ఏకంగా ఊరంతా కదిలారు. దాదాపు 100 మందికిపైగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. తాగు, సాగు నీటికి అవస్థలు పడుతున్నామని తెలిపారు. వ్యవసాయ పనులు మానుకుని పొద్దంతా నీళ్లు మోసుకోవాల్సిన దుస్థితి నెలకున్నదని ఆవేదన చెందారు. నీటి కొరత కారణంగా ఇతర గ్రామాల తల్లిదండ్రులు ఆడ పిల్లలను మా గ్రామానికి ఇవ్వడానికి ఇష్టపడడం లేదని ఆందోళన చెందారు. నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను పలుమార్లు కోరినా ఫలితం లేదని ఆందోళన చెందారు. గ్రామంలో సాగునీటి వనరులు లేకపోవడంతో ఎండాకాలంలో భూగర్భ జలాలు అండుగంటి పోతున్నాయని, ప్రస్తుతం ఒకే చేతిపంపు పని చేస్తుండగా ఊరంతా నీటికోసం దానిపైనే ఆధారపడాల్సి వస్తుందని తెలిపారు. వ్యవసాయ పనులు, ఉపాధి హామీల పనులు మానివేసి పొద్దంతా మంచి నీరు పోయాల్సి వస్తుందన్నారు. సమయం అంతా నీళ్లకోసం పోతుండడంతో ఇతర పనులు ఏమీ చేసుకోలేని పరిస్థితులు నెలకున్నాయన్నారు.

### పరిష్కారానికి కలిసి వచ్చినం..



మా గ్రామ పంచాయతీ పరిధిలో సుంగాపూర్ తండా, సుంగాపూర్ గొండ్‌గూడ, సుంగాపూర్ కొలాంగూడలు ఉన్నాయి. పంచాయతీ పరిధిలో అన్ని గ్రామాల్లో తీవ్రమైన మంచినీటి సమస్య ఉంది. పంచాయతీకి తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎన్నో రోజులుగా కోరుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. దీంతో ఊరంతా కలిసి ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించడానికి వచ్చాం. మా సమస్య విన్న కలెక్టర్ సానుకూలంగా స్పందించి తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. **- జాదవ్ ప్రేమ్‌సింగ్, మాజీ సర్పంచ్, సుంగాపూర్**

### పొద్దంతా నీళ్లు మోసుకుంటున్నాం..



తాగునీటి సమస్య కారణంగా గ్రామస్తులు పొద్దంతా నీళ్లు మోయాల్సి వస్తుంది. ప్రస్తుతం గ్రామంలో ఉన్న ఒక చేతిపంపు ద్వారానే నీరు వస్తుండడంతో అందరం అక్కడికివెళ్లి నీళ్లు తీసుకొస్తున్నాం. వ్యవసాయ పనులు, ఉపాధి పనులకు పోలేని పరిస్థితి ఉంది. దీంతో ఉపాధికి నష్టపోవాల్సిన పరిస్థితి నెలకున్నది. తాగునీటి సమస్య పరిష్కారానికి గ్రామస్తులందరం కలిసి వాహనం తీసుకుని కలెక్టర్‌ను కలువడానికి వచ్చినం. పశువులు కూడా తాగునీటి కోసం తంటాలు పడాల్సి వస్తుంది.

**- రాథోడ్ సాహెబ్‌రావు, సుంగాపూర్**

# సీసీఐ పునరుద్ధరణపై ప్రకటన చేయించాలి


గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

- మాజీ మంత్రి జోగు రామన్న
- బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీజేపీ నాయకులు

ఎదులాపురం, మార్చి 17 : సీసీఐ ఫ్యాక్టరీ తుక్కును మాత్రమే వేలం వేస్తున్నామని చెబుతున్న ఎంపీ, ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కేంద్ర మంత్రితో ప్రకటన విడుదల చేయించాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీలో చురుగ్గా పని చేస్తున్న ఆ పార్టీ పట్టణ కార్యదర్శి భగత్ నరేశ్, సోషల్ మీడియా కన్వీనర్ రాంచర్ల శరత్‌లు మాజీ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై ఎంపీ సొంత గ్రామమైన జాతర్ల శివాలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. తాను చెప్పినవి అబద్ధాలు కావని వారైన ప్రమాణం చేయాలన్నారు. దీనిపై స్పందించకుండా ప్రజలను పక్కదోవ పట్టించడానికి జిమ్మిక్కులు చేస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అనేక మార్లు కేంద్ర మంత్రులను కలిసిన విషయాన్ని ఎంపీ నగేశ్ గుర్తించాలన్నారు. ఫ్యాక్టరీ టెండర్ ప్రక్రియపై ఉద్యోగులు, అఖిల పక్షం, తాము ఉద్యమిస్తామని ప్రకటించడంతో మార్చి 7న జరగాల్సిన టెండర్ రద్దు చేశారు. ప్రతిపక్షంలో ఉన్న ప్రజల కోసం బీఆర్ఎస్ పని చేస్తుందని స్పష్టం చేశారు. సీసీఐ పునరుద్ధరణకు బుధవారం నుంచి అఖిల పక్షంతో కలిసి కలెక్టరేట్ ఎదుట రిలే దీక్షలు చేపడుతామని పేర్కొన్నారు. సీసీఐ పునరుద్ధరణతోపాటు ఎయిర్‌పోర్ట్ విషయంలో బీజేపీ ఎంపీ, ఎమ్మెల్యేలు కేంద్ర మంత్రులతో స్పష్టమైన వైఖరిని తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అజయ్, నారాయణ, మహేందర్, పండ్ల శ్రీను, కుమ్ర రాజు, వెంకట్ పాల్గొన్నారు.